# భగ్న మాహాత్మ్యం

## పి.ప్రతిమ

ఈరోజు సోమవారం.

ప్రజా విజ్ఞప్తుల దినం. వివిధ వర్గాలకు చెందిన రకరకాల వ్యక్తులు తలోరకమైన సమస్యతో అర్జీలు వ్రాసుకొచ్చి నా సహాయం కోరుకుంటారు. వాళ్ళందరికీ వారి వారి సమస్యల కనుగుణంగా నచ్చచెప్పి పంపించడానికి నేను గొప్ప సహనాన్ని అరువు తెచ్చుకుంటూ వుంటాను. అందుకే త్వరగా లేచేశాను.

నేనీ డివిజన్‌కి కొత్తగా నెల్రక్రితమే అప్పాయింటయి వచ్చిన సబ్‌కలెక్టర్ని. ఈ నెల రోజులకే నాలుగు సంవత్సరాల అనుభవంతో నా తల పండిపోయింది. గతంలో వున్న అధికారులంతా కేవలం పేరుకే తప్ప ఈ డివిజన్ అభివృద్ధి గురించి పెద్దగా పట్టించుకున్నట్లు లేదు.

వచ్చిన దగ్గర్నుంచీ ఓ ప్రక్క నుండి ఆఫీసు వ్యవహారాలు నిర్వహిస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను.

''ఏదో కొత్తకదా బొత్తిగా నిజాయితీగా వుందీ ఆడకలెక్టరు'' అంటూ అంతా చాటుమాటుగా నవ్వుకోవడం గమనిస్తూనే వున్నాను. అయినా తలపెట్టిన కార్యక్రమాలేవీ అర్థాంతరంగా ఆగిపోవడంలేదు.

ఎంతటి ఒంటరి తనంలో నైన 'గుండెధైర్యం' అనేది వుంటే ఓ వ్యక్తి మనకు తోడుగా వున్నట్లేనని నాన్న నాకు చిన్నప్పుడే చెప్పారు.

బాల్యం నుండి నన్ను అన్నయ్యలతో సమానంగా పెంచి పెద్ద చేసి ధైర్యసాహసాలనే ఊపిరిగా పీల్చటం నేర్పిన నాతండ్రే ఈనాటి నాస్థితికి కారణం... నాలోని అథారిటివ్ అండ్ కమాండింగ్ మెంటాలిటీని బాల్యంలోనే గుర్తించి నా తత్వానికి అనుగుణమైన రంగాన్ని ఎన్నుకుని నాతో ఐ.ఏ.ఎస్ చేయించిన నా తండ్రి నేను అప్పాయింటయి అధికారాన్ని చేతిలోనికి తీసుకునేంత వరకూ ఆగలేక హడావిడిగా ఏదో పనున్నట్లుగా మరో లోకానికి తరలి పోవడం నిజంగా నా దురదృష్టమనే చెప్పక తప్పదు.

''సుజా ఏంటి తెల్లారకముందే ఆలోచనలో పడ్డావ్?... అసలే ఈరోజు నువు బిజీ కదా... లేచి ఈ దీనుడికో కప్పు కాఫీ ఇవ్వకూడదు?'' నా నడుంమీద చేయివేసి దగ్గరకు లాక్కోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు శుభాకర్.

రజాయిలోని వెచ్చదనాన్ని అనుభవిస్తూ నాన్న గురించిన మధుర స్మృతులలో మునిగి వున్న నేను ఉలిక్కిపడి అతడిని తప్పించుకుంటూ పైకి లేచాను.

* * *

మధ్యాహ్నం పన్నెండయింది.

ఒకరి తర్వాత ఒకళ్ళని ప్రతివాళ్ళని కలుసుకుని వాళ్ళ సమస్యల్ని వింటూ వీలైనంతవరకూ అక్కడికక్కడే పి.ఏని పిలిచి పరిష్కారమార్గాల్ని సూచిస్తున్నాను.

నెక్స్ట్ అన్నాను కుర్చీలో రిలాక్స్‌డ్‌గా వెనక్కివాలుతూ.

తలుపు నెట్టుకుని ఇరవైమూడేళ్ళ యువకుడు లోనికొచ్చాడు.

ఇతడిని ఇదివరకే ఎక్కడో చూసినట్లుగా అన్పిస్తోంది. ఎక్కడైవుండొచ్చు? ఎక్కడయినదీ ఎంత ఆలోచించినా గుర్తుకు రావడం లేదు... ఈ డివిజనుకి వచ్చిన ఈనెల రోజుల్నుంచీ నేను చాలా మందినే కలుసుకున్నాను... వివిధ ప్రాంతాలకి క్యాంపులకి వెళ్ళాను... మరి ఇతడ్ని ఎప్పుడు ఎక్కడ ఎలా చూశానో గుర్తు లేదు.

మనిషి నలుపూ, తెలుపూ కాని ఛామనఛాయతో, ఈకాలం కుర్రాళ్ళలా హడావిడిగా కాకుండా ఎంతోనమ్రతగా, నెమ్మదిగా వున్నాడు. అతడు దుస్తులు ధరించిన తీరు కూడా క్రింద పెద్దరికంగా వుంది.

''నమస్తే మేడమ్'' చెప్పాడతడు.

నా సహజ ధోరణిలో తలాడించి ''చెప్పండి'' అన్నాను గంభీరంగా.

''మేడమ్ నా పేరు ప్రేమ్‌చంద్.... గత నెల రెడ్డిపాళెం అక్షరదీపం కార్యక్రమంలో మీరు నన్ను చూశారు'' సంకోచిస్తూనే అయినా చక్కటి గొంతుతో స్పష్టంగా చెప్పాడు.

అయితే ఇప్పుడు నాకు టైమైపోయింది.మామూలు ఉద్యోగినుల్లా కాక ఈ అఫిషియల్ పోస్టింగ్స్‌లో వున్న ఆడవాళ్ళ పరిస్థితి మరింత సున్నితంగా వుంటుంది.ఇటు గృహావసరాలూ, అటు ఉద్యోగ బాధ్యతలూ ఒకదానికొకటి క్లాష్

అవును... నేనీ డివిజన్‌కి వచ్చిన తరువాత అఫిషియల్ లెవల్లో పాల్గొన్న తొలి ఫంక్షన్ రెడ్డి పాళెం అక్షరదీపం కార్యక్రమం. ఆరోజున ఈ ప్రేమ్‌చంద్ తనదైన బాణీలో గద్దర్ వ్రాసిన రెండు పాటల్ని అద్భుతంగా పాడి వినిపించాడు.

మెలోడియస్‌గా వున్న ఆగొంతూ, అభినయిస్తూ పాడిన ఆవిధానం, ఆ పాటలోని సాహిత్యం నన్నెంతో ముగ్ధురాలిని చేశాయి. అందుకే నా అంతశ్చేతన ఈ వ్యక్తిని మర్చిపోలేక పోయి వుండవచ్చు. కార్యక్రమం ముగిస్తూ ఈ ప్రేమ్‌చంద్ పాటని గురించి రెండు వాక్యాలు మెచ్చుకోలుగా కూడా చెప్పినట్లున్నాను.

''మేడమ్ ఇంత త్వరలో మీ వద్దకు వస్తాననీ, రాగలననీ అనుకోలేదు''

''చెప్పండి''

''నేను...నేను టీచర్ ట్రయినింగ్ పాసయ్యాను. నేనేదో తనని ఉద్ధరిస్తానని తలచి ఓ పూట పస్తుండి, పదిళ్ళలో పాచిపని చేసి నన్ను చదివించింది నా తల్లి. జీర్ణమైపోయిన బ్రతుకు వస్త్రాన్ని అతుకులతో నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్న నా ముసలి తల్లికి ఈ స్థితిలో పట్టెడన్నం పెట్టలేకపోవడం నిజంగా నా దురదృష్టం. దాదాపు కళ్ళనీళ్ళు పడుతున్నాయి.

అయినా అఫిషియల్‌గా ఇలాంటివి ఎన్నో చూస్తుంటాను నేను.

''మీరెందుకొచ్చారో చెప్పండి''. అడిగాను సూటిగా

''మేడమ్ లోయర్ గ్రేడ్ టీచర్ల పోస్టింగ్స్ పడుతున్నాయి. ఇంటర్వ్యూ అయింది. లిస్ట్‌లో కూడా నాపేరు వచ్చింది... నాకీ చిన్న సహాయం చేయగల్గితే జంకుతూ జంకుతూ నమ్రతగా అన్నాడు.

''ఓ రికమెండేషనా?'' అన్నాను సీరియస్‌గా.

''కాదు మేడమ్: నాముసలి తల్లిని పస్తులతో చంపకుండా ఇది మీరు నాకు పెట్టే భిక్ష....నాకు గొప్ప గొప్ప వాళ్ళెవరూ తెలీదు. పాచిపని చేసి బ్రతుకీడుస్తున్న తల్లి వున్న నాకు పెద్ద పెద్ద పరిచయాలెలా వుంటాయి. ... కాబట్టి రికమెండేషన్ తీసికెళ్ళే అవకాశం లేదు... ఓ పూట తింటే నాలుగు పూటలు పస్తులుండే నేను దక్షిణ ఇచ్చుకోవడానికి అనర్హుడనే ఉత్తర, దక్షిణ లేవీ లేకుండా ఉద్యోగం రావడం అసంభవం....మీరు ఒక్కమాట సాయం చేయగలిగితే జీవితాంతం ఋణపడి వుంటాను. నా తల్లిని బ్రతికించుకుంటాను''దీనంగా చెప్పాడు.

''మంచిది ఇక మీరు వెళ్ళవచ్చు'' అన్నాను వాచీ చూసుకుంటూ సమయం వృధా అయిపోతోందని...

అతడు నిరాశగా నమస్కరించి నిష్క్రమించాడు. అతడు వెళ్ళిపోతోంటే మృదువుగా వినవస్తున్న అతడి అడుగుల చప్పుడు వింటూ నా డైరీలో వ్రాసుకున్నాను. ''ప్రేమ్‌చంద్...రెడ్డిపాళెం....లోయర్ గ్రేడ్ టీచర్స్ పోస్టింగ్స్'' అంటూ.

ఆతడి ఎదుట నిరాకరించిన మానవత్వమున్న మనసు అజ్ఞాతంగా నైనా అతడికి సహాయం చేయడానికే నిర్ణయించుకుంది.

* * *

రెండునెలలు గడిచాయి.

ఆరోజు మళ్ళీ ప్రేమ్‌చంద్ వచ్చాడు. ఈ సారి కొంత గేప్ వచ్చినా నేనతడ్ని తేలిగ్గానే గుర్తుపట్టగలిగాను

''ఎందుకొచ్చాడబ్బా ఈపాటికి ఉద్యోగం వచ్చేఉం

దాలి'' అనుకుంటూ అతడివైపు చూశాను.

''నమస్తే మేడమ్''... కళ్ళుమూస్తూ తలాడించాను.

''మేడమ్ మీకు కృతజ్ఞతలు ఎలా తెలుపుకోవాలో తెలీడంలేదు. మీరు చూపించిన దయవల్ల నాతల్లికి రెండుపూటలా పట్టెడు మెతుకులు పెట్టుకోగలుగుతున్నాను.''

ఇది నేను చేసిన సహాయమేనని అతడికి అర్థమైనట్లుంది.

''ఊ '' అన్నాను ఆసక్తిలేనట్లుగా.

''మేడమ్''మౌనంగా వుండిపోయిన నన్ను చూసి మళ్ళీ పిలిచాడతడు.

''మేడమ్ చిన్నరిక్వెస్ట్''... మెల్లగా ఫైల్స్‌లో నుండి తలెత్తి అతడివంక చూశాను ఏమిటన్నట్టుగా.

''నాదో చిన్న రిక్వెస్ట్... మీరేమీ అనుకోనంటే''

''త్వరగా చెప్పండి...టైమ్‌లేదు'' అన్నాను వాచీ చూసుకుంటూ.

''మేడమ్ మా ప్రక్కింటి వారమ్మాయి మయూరి, నేను ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నాం....'' తలదించుకుని సిగ్గుతో చెప్పసాగాడతడు.....అతడి మాటలు పూర్తికాక మునుపే పెద్దగా అరిచాను.

''వ్హాట్ నాన్సెన్స్ యూర్ టాకింగ్, అవన్నీ నాకెందుకు చెప్తున్నారు''

''ప్లీజ్....ప్లీజ్ మేడమ్ ఒన్‌మినిట్'' అంటూ ఓ చిన్న కాగితం తీసి టేబుల్ మీద పరిచాడు.

''ఏమిటది?''

'మయూరి నాకు వ్రాసిన ఉత్తరం''

''అయితే'' ఉత్తరాన్ని గమనించకుండా అతడివైపే చూస్తూ ప్రశ్నించాను.

''మేడమ్... ఒక్కసారి ఇటు చూడండి. ఈ ఉత్తరం రెడ్‌ఇంక్ పెన్‌తో వ్రాసిన ఉత్తరం కాదు....మయూరి స్వయంగా తన రక్తాన్ని చిందించి వ్రాసిన లేఖ... ప్లీజ్... ఒక్కసారి చదవండి మేడమ్'' ప్రాధేయపడుతున్నాడు.

అసహనంగా తల పైకెత్తాను.

'మేడమ్... జీవితాన్ని ఎంతో చదివినవారు. మీకు ప్రేమ విలువ తెలీకుండా వుండదు.


నిజమే! ప్రేమగురించి నాకు తెలీక పోవడమేంటి? పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసే రోజుల్లో శుభాకర్ ఎడతెరిపి లేకుండా తనని కలుసుకోవాలని ఎంతగా ప్రయత్నించేవాడు... ఒక్కరోజు అతడు కన్పించకపోతే ఎంత నిరాశగా తోచేది తనకి. గబుక్కున ఆరోజులు జ్ఞప్తికి వచ్చి నా మనసు మెత్తబడింది.

''అయితే ఏమిటి?''

''ఒక్కసారి ఈ లెటరు చదవండి.... ఆ తర్వాత మీరు చెప్పమంటే మీవద్దనుండి ఎటువంటి సహాయం కావాలని కోరుకుంటాను. ''చిరునవ్వుతో చెప్పాడతడు.

జాలిపడి ఉద్యోగం ఇప్పించేసరికి ఇతడికి తనదగ్గర ఏదో పెద్ద చనువున్నట్లు మాట్లాడేస్తున్నాడు. విసురుగా ఉత్తరం తీసుకుని ఓసారి పైనుండి క్రిందికి చూశాను... రక్తాక్షరాలు.

''ప్రేమ్...నా ప్రియాతి ప్రియమైన ప్రేమ్''



అంటూ మొదలుపెట్టి ఆద్యంతమూ ఆర్తిగా, అచ్చమైన నెంబర్‌వన్ ప్రేమికురాల్లా ఆత్మీయంగా వ్రాసింది. చదవడం పూర్తిచేసి అతడికేసి చూశాను. నాకెందుకో అతడిని చూసి జాలేసింది.

''మేడమ్ దయచేసి మీరేమీ అనుకోనంటే ఓ విషయం...

మయూరి తల్లిదండ్రులు మాపెళ్ళికి ఎంతమాత్రమూ ఒప్పుకోరు. మయూరి లేకుండా నేను బతకలేను ... నేను చచ్చిపోతే నా ముసలితల్లికి ఆధారం లేకుండా పోతుంది...

''అయితే! నన్నేం చేయమంటారు'' సహనాన్ని అరువు తెచ్చుకుని కాస్త సౌమ్యంగానే ప్రశ్నించినట్లున్నాను. దాంతో అతడికి ఉత్సాహం వచ్చేసింది.

''మేడమ్! ఈ మధ్యన ప్రేమించుకున్న జంటలకి తల్లిదండ్రులు కాదన్నా పోలీస్‌స్టేషన్లో పెళ్ళి జరిపిస్తున్నారు.... మీరు తలచుకున్నట్లయితే మా పెళ్ళి జరిపించగలరు. అప్పుడు మా పెళ్ళికో ఆమోద ముద్ర వుంటుంది. అప్పుడు ఆమె తల్లిదండ్రులు నన్ను కొట్టి మయూరిని తీసికెళ్ళిపోయే ప్రమాదం లేదు... ప్లీజ్ మేడమ్'' ప్రాధేయపడుతూ చెప్పాడు.

''మీ వూరి పోలీస్ స్టేషన్లో అడగలేకపోయారా''

''మావూరి పోలీసులు మయూరి తండ్రికి బాగా కావాల్సినవాళ్ళు. వాళ్ళీపని చేం :ని నేననుకోలేదు.

మీరొక్కరే నాకు తెలిసిన వాళ్ళు.....ఆత్మీయులుగానూ తోచి ఇలా...

'చూద్దాం...రేపు నేను కేంప్‌కి వెళుతున్నాను. వుండను. ఎల్లుండి కన్పించండి'' ఇకవెళ్ళచ్చన్నట్లుగా చూశాను.

''థాంక్యూ మేడమ్'' హద్దులు దాటిన ఆనందంలో కృతజ్ఞతా పూర్వకంగా చేతులు జోడించాడు.

రెండు రోజులు గడిచాయి.

ఆరోజు తెల్లవారురఝామున అయిదింటికి ఫోన్ మోగింది. అది శుభాకర్‌కి ఫోన్లో మాట్లాడి చక చకా మొహం కడిగేసుకుని డ్రస్ చేసుకుంటున్నాడు శుభాకర్.

''ఏమైంది?'' ప్రశ్నించాను రగ్గుతొలగిస్తూ.

'ఎవరో తిన్నదరక్క వురేసుకుని చచ్చిపోయాడు... ఆస్టేషన్లో ఎస్.ఐ లేడట వెంటనే నన్నెళ్ళి చూసుకోమని ఎస్.పి గారి ఫోను'' అంటూ ఆగకుండా వెళ్ళిపోయాడు. అతడు ఈ డివిజన్లోనే అడిషనల్ ఎస్.పిగా చేస్తున్నాడు. బాగా బిజీ.

ఇక ఆ తరువాత నిద్రపట్టలేదు. నిన్నంతా... కేంప్‌లో వున్నానేమో ఈవేళ చాలా పనుంది ఆఫీసులో. అందుకే లేచి ఇంటి పనులు చూసుకోసాగాను.

తొమ్మిదింటికి తిరిగొచ్చాడు శుభాకర్.

''స్నానం చేస్తారా?'' డ్రస్ కూడా మార్చకుండా సోఫాలో జారగిలబడి కూర్చుని తల వెనక్కి వాల్చి కళ్ళుమూసుకున్న శుభాకర్‌ని ప్రశ్నించాను.

''ముందు కొంచెం కాఫీ ఇవ్వు సుజా'' బాగా అలసటగా వున్నాడతడు. రంగమ్మ కాఫీ కలిపితే శుభాకర్‌కి నచ్చదు.... అందుకే సాధ్యమైనంత వరకూ నేనే కల్పి ఇస్తూంటాను...

అయితే ఇప్పుడు నాకు లైటైపోయింది. మామూలు ఉద్యోగినుల్లా కాక ఈ అఫిషియల్ పోస్టింగ్స్‌లో వున్న ఆడవాళ్ళ పరిస్థితి మరింత సున్నితంగా వుంటుంది, ఇటు గృహావసరాలూ, అటు ఉద్యోగ బాధ్యతలూ ఒకదానికొకటి క్లాష్ అవకుండా ఒకదాని మూలంగా మరోదానికి అంతరాయం కలగకుండా మేనేజ్ చేసుకుంటూ రావడం కష్ట సాధ్యమైన విషయం.

''ఏమిటి అలావున్నారు'' కాఫీఇస్తూ సాధ్యమైనంత మృదువుగా ప్రశ్నించాను.

'అలసట. అంతే మరేమీ కాదు. నువ్వెళ్ళిపో సుజా... రంగమ్మ వుంది కదా.... నేను టిఫిన్ చేసి వెళ్తానులే''

''అలాగే! అక్కడెవరో వురేసుకున్నారన్నారు... అయిపోయిందా అక్కడి పని'' హేండ్ బ్యాగ్ సర్దుకుని, చెప్పులు మార్చుకుంటూ యాధాలాపంగా ప్రశ్నించాను

''ఊ '' నవ్వాడు శుభాకర్.

'ప్రేమ కేసు... ప్రేమించుకున్నారిద్దరూ... ఆ అమ్మాయి తల్లిదండ్రులకిష్టం లేదు చెప్పి చూశారు.... వీరివురూ పారిపోయి పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఎలా తెలిసిందో ఆమె తల్లిదండ్రులకు అడ్డుకున్నారు. దాంతో అక్కడ అబ్బాయి ఎదురు చూసి, చూసీ ఎంతకీ అమ్మాయి రాకపోవడంతో నిస్పృహతో వురేసుకున్నాడు.

''అలాగా''

''అసలది 'ఉరే'కాదు. నిద్రపోతున్న వాడిని లేపి తీసికెళ్ళారు. నాకొడుకుని చంపి చెట్టుకు వేలాడదీశారు అంటూ గోడుగోడున ఏడుస్తోందా తల్లి. దాంతో కేసు కొత్త మలుపు తిరిగింది. పోస్ట్ మార్టమ్‌కి పంపి ఇలా వచ్చాను.''

''ఐ.సీ'' సాలోచనగా చూసి పైకిలేచాను ఇక వెళాతనన్నట్లుగా.

'ఇంతకీ ఆ అబ్బాయి పేరేమిటో తెలుసా? క్యాజువల్‌గా అన్నాడు శుభాకర్ కాఫీ సిప్ చేస్తూ.

''ఊ '' అనాసక్తిగా చూశాను.

''ప్రేమ్‌చంద్...ప్రెమకోసం ప్రాణత్యాగం చేశాడు చిన్నవాడు. ఈకాలం కుర్రాళ్ళు చాలా ఆవేశపరులు ప్రేమకో అర్థమూ, ప్రాణానికి విలువా లేకుండాపోయాయి సుజా...'' శుభాకర్ ఏంచెప్తున్నాడో నా చెవులకు సోకలేదు.

''ప్రేమ్‌చంద్'' ఈరోజు వస్తానన్నాడు తనకు పెళ్ళి చేయమంటూ.


''ఏ వూరు?'' వెళ్ళబోతున్న దాన్నల్లా ఆగి ఆతృతగా ప్రశ్నించాను.

''రెడ్డిపాళెం'' కాఫీ కప్పు టీపాయ్ మీదుంచుతూ నింపాదిగా చెప్పాడు శుభాకర్. షాక్ తిన్నాను.

యాంత్రికంగా వెళ్ళి జీప్‌లో కూర్చున్నానే కానీ నా మెదడు శూన్యమైపోయింది.

''ప్రేమ్‌చంద్''... ఎన్ని ఆశలతో, ఎన్ని కోరికలతో జీవితాన్ని మొదలెట్టాడు. ఆ అక్షరదీపం కార్యక్రమంలో గద్దర్ పాటల్ని ఎంత అర్థవంతంగా, ఆవేశపూరితంగా పాడి విన్పించాడు. ఆపాటలే కదా అతడి మీద తనకో అభిప్రాయాన్నేర్పరిచాయి. ఆ శ్రావ్యమైన గొంతు ఇక శాశ్వతంగా మూతపడి పోయిందా? ఓ గాడ్.

తన తల్లికి పట్టెడు మెతుకులు పెట్టుకోడానికి అవకాశమివ్వకుండా ఎంత మృదువుగా తనని అర్థించాడు




మొన్నటికి మొన్నా ఆ మయూరిమీది ప్రేమని ఎంత ఆర్తిగా వ్యక్తపరిచాడు. ఈపెళ్ళి చేసి తీరాలంటూ కమిటయ్యేంత వరకూ తనని ఎంతగా ప్రాధేయపడ్డాడు.

ఈరోజు అతడి పెళ్ళి జరిపించాలని తనుకూడా ఉత్సాహంగానేవుంది. అటువంటి 'ప్రేమ్' ఈరోజు 'పెళ్ళిరోజు'ని 'మృత్యుదినం'గా మార్చుకుని శాశ్వతంగా ఈ ప్రపంచానికి దూరమైపోయాడు.

నాకెందుకో 'గుండె' ఈ గొంతులో కొచ్చినట్లయింది. అతగాడు మామూలుగా అయితే కేవలం నాడివిజన్లోని ప్రజల్లో ఒకడు.... కానీ అతడు చనిపోయి నాకేదో ఆత్మీయుడన్న భావాన్ని కలిగించాడు. ఒక్కసారిగా డ్యూటీ వదిలేసి ఆ వూరెళ్ళి ప్రేమ్‌చంద్‌ని చూసి వద్దామన్పించింది... కానీ కుదరదు. ఈరోజు అసలే బాగా బిజీగా వున్నాను... కాకపోయినా ఈ అధికారి స్థానాలు ఒక్కొక్కసారి చెప్పలేనంత ఇబ్బందులు గురిచేస్తాయి. చెయ్యాలని మనసా కోరుకున్నది చేయలేని పరిస్థితి.... చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నది చేయాల్సిన పరిస్థితీ ఏర్పడుతుంటుంది.

* * *

నాలుగు రోజులు గడిచాయి.

ప్రేమ్ చంద్ అమాయకమైన ముఖం పదే పదే జ్ఞాపకాని కొచ్చి నామనసు కలత బారుతోంది. అతడి ముసలి తల్లి ఏమైపోయిందో? ఎలా తట్టుకుందో

ఆరోజు రెడ్డిపాళెం క్యాంప్‌కి వెళ్ళాల్సి రావడం యాధృచ్ఛికమే అయినా ప్రేమ్‌చంద్ తల్లినిచూసేఅవకాశందొరికినందుకు సంతోషించాను. నేను వెళ్ళిన పనిచూస్తూ...పి.ఎతో ఆ విషయమై చర్చిస్తూండగా ఓ ముసలావిడా గోడు గోడునా ఏడుస్తూ వచ్చి నా కాళ్ళమీద పడింది.


గబుక్కున వెనక్కి జరిగి ఆమెని లేవనెత్తి ప్రశ్నించాను.

''ఏమిటి? ఏమైంది?'' గంభీరంగా వుంది నా గొంతు.

అమ్మా కలెక్టరమ్మ తల్లీ....నాకొడుకుని చంపేశారమ్మా...ఇష్టం లేకపోతే పెళ్ళి చేయము అంటే నేనూ, నా కొడుకూ ఎక్కడికైనా దూరంగా వెళ్ళి బతికేవాళ్ళం కదమ్మా... నాకిట్టా కడుపు మంట పెట్టారే...వీళ్ళకు మాత్రం రాదా ఈ శోకం ''అంటూ శాపనార్థాలు పెడుతూ తన శోకాన్నిదిగమింగడానికి ప్రయత్నిస్తోంది. అర్థమైంది ఆవిడే ప్రేమ్‌చంద్ తల్లి అని. నాకావిడ్ని చూస్తుంటే ఎంతో జాలిగా అన్పించింది. పి.ఎ ఆవిడ్ని దూరంగా లాగడానికి ప్రయత్నిస్తుంటే వారించి ప్రశ్నించాను.

''నీ కొడుకుని ఎవరో చంపారని ఎందుకంటున్నావు ?!''





ఊఁ

"తను ఒంటరిగా వుందని రమ కబురు చేస్తే వెళ్లానా"

"ఆ ఆ... వెళ్లేం చేసావ్?"

"ఊఁ... ఇల్లు శుభ్రం చేసా"

"?!?"

—పద్మశ్రీ (మాణిక్యారం)

"నాకొడుకు నన్నొదలి టవును వెళ్తేనే రాత్రి వుండకుండా వచ్చేస్తాడమ్మా... నేనంటే అంత ప్రేమ తల్లీ... అటువంటిది నన్నొంటరిదాన్ని చేసి వాడింతపని చేయడు....పైగా వాడు పిరికోడు కాదమ్మా ధైర్యవంతుడు... హాయిగా నిద్రపోతున్న నాబిడ్డను పనుంది రమ్మంటూ లేపి తీసికెళ్ళారమ్మా" అంటూ మళ్ళీ విలపించసాగింది.

"పోలీస్ ఎంక్వయిరీలో నీకొడుకు తనే ఉరేసుకుని చనిపోయినట్లు తేలిందికదా" ఆరోజు ఉదయం శుభాకర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ అడిగాను.

"అవును తల్లీ. వాళ్ళూ వాళ్ళూ అంతా లాలూచీ పడ్డారు. నాకెవరున్నారు తల్లీ చెప్పుకుపోవడానికి. నాకొడుకు నిన్నేదైవంగా నమ్మిపూజించేవాడు... ఇప్పుడు వాడు చనిపోయినా సహాయం చేయాల్సింది.... నువ్వుతప్ప మాకే దిక్కులేదు" అంటూ మాటలు అలుక్కుపోగా రోదిస్తోంది సన్నగా.

"ముందా ఏడుపాపు" అంటూ విసుక్కున్నాడు పి.ఎ.

"నేను కనుక్కుంటాను... మీరిక వెళ్ళండి" చెప్పానామెతో.

"ఆ పిల్లా తల్లే చేయించిందమ్మా...వెళ్ళొస్తాను తల్లీ" అంటూ ఏడుపు దిగమింగుకుంటూ వెళ్ళిపోయిందామె.

పి.ఎని పిలిచి ప్రేమ్‌చంద్‌కి స్కూల్లో రావల్సిన అరియర్స్ గురించీ, అతడికి ఎల్.ఐ.సి పాలసీ ఏదైనా వుందేమో కనుక్కుని అన్ని విషయాల్లోనూ ఆ తల్లికి సహాయం చేయమని ఆదేశించాను.

నాలుగ్గంటలకి పని పూర్తయి తిరిగి వెళ్ళిపోదామనుకుంటూండగా హఠాత్తుగా నాకో ఆలోచన వచ్చింది. ఓసారి మయూరిని చూస్తేనో అని అనుకున్నదే తడవుగా పి.ఎని పిలిచి విషయం చెప్పాను.

వాళ్ళిప్పుడు ప్రేమ్‌చంద్ ప్రక్కఇంట్లో కాకుండా వూరికి దూరంగా మరెక్కడో వున్నట్లు తెలిసింది. వెళ్తూ వెళ్తూ ఆలోచిస్తూన్నాను.

ఓ అఫిషియల్‌గా నేను ఆ అమ్మాయిని కలుసుకోకపోవడం ఎంతవరకూ సమంజసం అన్న ఆలోచన కలగలేదా క్షణంలో నాకు.

ప్రియుడు శాశ్వతంగా దూరమైపోయిన వేళ ఆ ప్రేయసి, అందునా గుండెలోతుల్లో నుండి, తన శరీరంలోని రక్తంతో ఉత్తరాలు వ్రాయగల ఆ ప్రేయసి ఎలా వుండివుంటుంది? ఎలా తట్టుకొని వుంటుందీ పరిస్థితిని. అందులోనూ ప్రేమ్‌చంద్ వంటి ఉదాత్తమైన వ్యక్తిని భర్తగా పొందబోయే క్షణాన అతడికి శాశ్వతంగా దూరమై ఆ అమ్మాయి ఎంతటి క్షోభను భరిస్తు వుంటుందో తలుచుకుంటేనే అప్రయత్నంగా నా కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

రక్తాక్షరాలతో నిండివున్న ప్రేయసి ఉత్తరాన్ని చూపుతూ ఆమెతో జీవితాన్ని ముడివేసుకోవడం కోసం ఆర్తిగా నా ముందు నిల్చున్న ప్రేమ్‌చంద్ మరోసారి నా స్మృతి పథంలో నిలిచాడు. ఆ గొంతులో ఎంత ఆశ, జీవితం పట్ల ఎంతకోరిక, ఎంత ఆకాంక్ష, అటువంటి ప్రేమికుడిని మనసారా కావాలనుకున్న మయూరి పరిస్థితి ఎలా వుండి వుంటుందో ఊహించడం కష్టమేమీ కాదు.

ప్రేయసీ ప్రియుల నడుమ వుండే ప్రేమానుబంధం తక్కువది కాదు. వాళ్ళు చెప్పుకున్న వూసులూ, చేసుకున్న బాసలూ స్థిరమైనవి. వారి నడుమ ప్రేమానురాగాలే తప్ప మోస ద్వేషాలకు తావులేదు.

అటువంటి ప్రేయసీ ప్రియుల్లో ఒకరు శాశ్వతంగా దూరమైతే, రెండవ వాళ్ళకు రంపపు కోత మాత్రమే మిగులుతుంది.

మనసునెవరో క్రూరంగా చీలుస్తున్నట్లుగా వుంటుంది.

"ఈ సర్వ ప్రపంచంలో ఎవరు ప్రియా నీలా ప్రేమించగరు...ఎవరు నీలా చిరునవ్వు నవ్వగలరు" అంటూ వాళ్ళు చెప్పుకున్న వూసులు, జ్ఞాపకాల పొరలో కదలాడుతూ, గతం తాలూకూ అనుభూతుల్ని నెమరు వేసుకుంటూ, దహించుకుపోతున్న మనసుని ఉబికి వచ్చే కన్నీటితో ఆర్పడానికి ప్రయత్నిస్తూంటూంది.

"అమ్మా వచ్చేశాం" చెప్పాడు డ్రైవర్.

ఉలికి పడి బయటకి చూశాను. దాదాపుగా వూరి బయట పొలం లాంటి చోట పెద్ద కాంపౌండ్ మధ్యగా వుందాఇల్లు. కాంపౌండ్‌లో ఓ మూలగా వున్న రేగిచెట్టు కింద పొట్టిగా వున్న నైటీ వేసుకుని ఓ పదిహేనేళ్ళ అమ్మాయి, ప్రక్కనే మరొక చిన్న కుర్రాడు రేగిపండ్లు ఏరుకోవడానికి పోటీపడ్తున్నారు.

'ఇదేనండమ్మా ఇల్లు' చెప్పాడు డ్రైవర్ ఎంతకీ నేను దిగకపోవడం చూసి.

"ఐ.సీ" అంటూ కాలు బయట పెట్టాను.

"ఇదే ఇల్లు అయితే మరి అమ్మాయి ఎవరు మయూరి చెల్లెలా?

జీప్ శబ్దం వినగానే ఆ రేగిపండ్లు ఏరుతున్న నైటీ అమ్మాయి హడావిడిగా గేటు వద్దకి వచ్చింది.

"హేమలతగారిల్లు ఇదేనా?" ప్రశ్నించాడు డ్రైవరు.

"అవును అమ్మలేదు. పనిమీద టవునుకెళ్ళింది..... రండి." "నవ్వుతూ ఆహ్వానించింది. మెల్లిగా లోపలికి అడుగు పెట్టాను.

కుర్చీ చూపించింది. కూర్చుంటూ

"మయూరీ..." నింపాదిగా లోపలికి చూస్తు ప్రశ్నించింది. నేనే మయూరినని మీకెలా తెలుసు.... మీరు మమ్మీ ఫ్రెండా?" ఆశ్చర్యంతో ప్రశ్నించింది.

ఆశ్చర్యపోవడం నావంతైంది..."ఊఁ" అన్నాను.

నిశాప్రశాంత సమయంలో, ఏకాంతంలో నిన్నటి జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటూ ఆ ప్రియాతి ప్రియమైన వేస్తం గురించి బెంగపడుతూ వుంటుందనుకున్న మయూరి సరదాగా రేగిపండ్లు ఏరుకుంటూ ఇంటికొచ్చిన అతిథుల్ని ఆహ్వానించడం ఒకింత వింతగా తోచింది నాకు.

"అదే నాంటీ ఆఅబ్బాయి చనిపోయాడు కదా. అమ్మమీదికి వచ్చేలా వుందా కేసు.... ఆ విషయం గురించే ఎవరో రాజకీయ నాయకుడితో మాట్లాడటానికి వెళ్ళింది. "ఆ అమ్మాయి గడగడా చెప్తోంది, తనామె తల్లి స్నేహితురాలినని నమ్మి.

"అబ్బాయి ఉరి వేసుకున్నాడన్నారు కదా... అమ్మకేమిటి ఇబ్బంది." నాకేమీ ఆసక్తి లేనట్లుగానే ప్రశ్నించాను.

"ఏమోనాంటి తెలీదు" అందామ్మాయి తడబడుతూ. గబుక్కుని ఏదో స్ఫురించినట్లుగా అన్పించింది నాకు. చివ్వున లేచి నిల్చున్నాను.

"వుండండాంటీ మమ్మీ వచ్చేస్తుంది" అంటూ అమ్మాయి పిలుస్తున్నా విన్పించుకోకుండా బయటికి నడిచాను వెంటనే.

ఆత్మ విశ్వాసాన్ని అణువణువునా నింపుకుని, నిరాశా నిస్పృహల్ని దరిజేరనివ్వని ఆ యువకుడు ఆత్మహత్యచేసుకున్నాడంటే నాకెందుకో నమ్మబుద్ధి కాలేదు. అతడి తల్లి మొరపెట్టినట్లుగా అది హత్య అనిపిస్తోంది.

ఎంత పై లెవల్లో నుండైనా సరే దర్యాప్తు చేయించి, దోషులకు శిక్షపడేలా చేయాలనీ, అనాథమైన ఆ ముసలి తల్లికి న్యాయం చేకూర్చాలనీ గట్టిగా నిర్ణయించుకున్నాను

'ప్రేమ్ చంద్.... నువ్వెళ్ళిపోయి మంచి పనే చేశావయ్యా, వుండి వుంటే ప్రేమలో నిజాయితీ లేని ఇటువంటి అమ్మాయిని పెళ్ళాడి జీవితంలో ఓడిపోయి వుండే వాడివి" సీట్లో రిలాక్స్‌డ్‌గా వెనక్కివాలి ప్రేమ్ చంద్‌ని తలుచుకున్నాను.

ఏదో దారుణం జరిగినట్లుగా తూర్పు ఆకాశం రక్తవర్ణాన్ని పులుముకుంది. పొలాం మీదనుండి వీస్తున్న చల్లటి గాలి వేడెక్కిన నాబుర్రని చల్లబరచడానికి ప్రయత్నించి విఫలమవుతోంది. *

